
సాక్షి
పల్నాడు
గురువారం । 18 । ఏప్రిల్ । 2024



ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

చెరుకుపల్లి: ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ చెరుకుపల్లి తెనాలి ప్రధాన రహదారిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టింది. బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 508.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5500, గరిష్ట ధర రూ.7000, మోడల్ ధర రూ.6500 వరకు పలికింది.

న్యూస్‌రీల్

రేపు మురుగుడు లావణ్య నామినేషన్



మంగళగిరి: వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ఈనెల 19వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు పట్టణంలోని సీతారామ కోవెల నుంచి బయల్దేరి ర్యాలీగా మెయిన్ బజార్ మీదుగా గౌతమ బుద్ధా రోడ్డు చేరుకుంటారని పేర్కొన్నారు. అక్కడ నుంచి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తూర్పు నుంచి నూరి ఫాతిమా..



పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా షేక్ నూరిఫాతిమా ఈనెల 19న నామినేషన్ దాఖలు చేస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పిలుపునిచ్చారు. మంగళదాస్ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నామినేషన్ దాఖలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీనేతలంతా కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రింటర్స్ వివరాలు ప్రకటించడం తప్పనిసరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు అభ్యర్థుల ప్రచారం కోసం ప్రచురించే కరపత్రాలు, పోస్టర్స్‌పై తప్పనిసరిగా ప్రింటర్, పబ్లిషర్ల వివరాలు, చిరునామా సహా ప్రింట్ చేయాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివరాల వల్ల ప్రింటింగ్ ఖర్చులకు బాధ్యుల్ని గుర్తించడం తేలికవుతుందని ఆమె పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఆమె కోరారు.

24 నుంచి ఫుట్‌బాల్ సమ్మర్ కాంప్

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి కారంగుల సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి మే 26 వరకు సత్తెనపల్లిలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్, పాఠశాల పీడీ షేక్ మహ్మద్ రియాజ్ బుధవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో ఆసక్తి గల క్రీడాకారులు, బాలబాలికలు పాల్గొనాలని ఆయన కోరారు. వివరాలకు 9701052588, 7396967776 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీరామ నవమి వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి సన్నిధి నుంచి హనుమత్ సమేత సీతారామలక్ష్మణస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగింపుగా ఆలయ ఈవో కె.ఎస్.రామారావు, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు మోసుకుంటూ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. సీతారామ కల్యాణ విశిష్టతను వేద పండితులు వివరిస్తుండగా, అభిజిత్ లగ్నంలో స్వామి వారు అమ్మవారికి మాంగల్యధారణ చేశారు. ఆలయ ఈవో రామారావు స్వామివారికి, సీతాదేవికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.

నామినేషన్‌కు వేళాయె!

- నేడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ
- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా ఎన్నికల అధికారులు
- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- 25 వరకు తుది గడువు
- 26న పరిశీలన
- 27 నుంచి 29 వరకు ఉపసంహరణ



సత్తెనపల్లి నియోజకవర్గ ఆర్వో కార్యాలయం

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం (నేడు) నుంచి ప్రారంభమవుతోంది. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నేడు జిల్లా ఎన్నికల అధికారి అసెంబ్లీ, లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. నామినేషన్లను ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరిస్తారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఇప్పటికే జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను నియమించారు. నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ వ్యవహరిస్తారు. కలెక్టరేట్‌లో పార్లమెంట్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. మిగిలిన అసెంబ్లీ నియోజక వర్గాలకు డెప్యూటీ కలెక్టర్ స్థాయి ఉద్యోగుల్ని రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. ఆయా నియోజకవర్గ కేంద్రాలలో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల దాఖలు గడువు ఎనిమిది రోజులు ఇచ్చారు. అందులో ఏప్రిల్ 21వ తేదీ ఆదివారం కావడంతో దాఖలు వీలుపడదు. చివరి రోజులైన ఏప్రిల్ 25న మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

ఐదుగురికే అనుమతి

నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను ఇప్పటికే ఎన్నికల అధికార యంత్రాంగం పూర్తి చేసింది. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు. కార్యాలయానికి మధ్యాహ్నం 3 గంటలకు చేరుకున్న వారి నామినేషన్లు తీసుకుంటారు. అభ్యర్థితో పాటు పెద్ద సంఖ్యలో వచ్చే కార్యకర్తలను కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే నిలిపి వేస్తారు. నామినేషన్ల ప్రక్రియపై ఇప్పటికే అధికారులు రాజకీయ పార్టీ నాయకులకు సమావేశాలు ఏర్పాటు చేసి, అవగాహన కల్పించారు. నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేస్తారు.

29న సాయంత్రం జాబితా విడుదల

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు దాఖలైన నామినేషన్లను ఈ నెల 2న పరిశీలించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం అమోదం పొందిన జాబితాలను ఆర్వోలు ప్రకటిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు గడువు ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడవు పూర్తయిన తర్వాత 29వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాలను విడుదల చేసి, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తును అధికారులు ప్రకటించనున్నారు.

అప్రమత్తంగా పోలీసు శాఖ

నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ బింధుమాదవ్ నేతృత్వంలో పోలీసుశాఖ భారీ భద్రత ఏర్పాట్లు చేసింది. నామినేషన్లు వేసే ప్రాంతానికి వంద మీటర్ల దూరం లోపలికి అభ్యర్థితోపాటు మూడు వాహనాలు, నలుగురిని మినహా ఎవ్వరిని అనుమతించరు. ఆర్వో కార్యాలయాల వద్దకు ర్యాలీలు నిషిద్ధం. అభ్యర్థులు వారికి కేటాయించిన సమయంలో నామినేషన్లు వేసుకోవాలి. టపాసులు కాల్చకూడదు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొనేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. అభ్యర్థులు తమ ఇళ్లు, కార్యాలయాల నుంచి ఆర్వో కార్యాలయాలకు ర్యాలీగా వెళ్లే సమయంలో అవసరమైన పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాట్లు



పి.సరోజిని, ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి

నరసరావుపేట: వచ్చే నెల 13న జరిగే ఎన్నికలను పురస్కరించుకొని గురువారం నుంచి నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థుల నామినేషన్లను కార్యాలయంలో స్వీకరిస్తామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో పి.సరోజని పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల్లోగా దాఖలు చేయాలని సూచించారు. అలజడులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్డీవో కోరారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, జేసీ, ఇతర అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి
- సమీక్షలో పాల్గొన్న జిల్లా ఎస్పీ, జేసీ, అధికారులు

నరసరావుపేట: నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికలు జీరో శాతం హింస, రీపోలింగ్‌కు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సహాయ, సహకారాలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, మండల, సెక్టార్ అధికారులు, పోలీసు సిబ్బందితో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీ విజిల్ యాప్ అమలులో పల్నాడు జిల్లా ముందు వరుసలో ఉందని తెలిపారు. జిల్లాలో మొత్తం 557 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రిటైర్డ్ పోలీస్ అధికారుల్ని బందోబస్తు, క్యూలైన్ మేనేజ్‌మెంటు విధులకు ఉపయోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. ఈవీఎంల కమిషనింగ్ మే 1,2,3 తేదీల్లో జరుగుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అదే నెల 5,6,7 తేదీలు, హోం ఓటింగ్ 8,9 తేదీల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 85 ఏళ్ల పైబడిన వారు, ముందస్తుగానే పీడబ్ల్యూడీగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని, వారికి 12-బీ ఫారాలు అందిస్తామని చెప్పారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల రోజున పోలింగ్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈసారి ఎన్నికలు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఐడీ కార్డు ధరించాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ సెంటర్‌గా జేఎన్టీయూ కాలేజీని ఎంపిక చేశామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీలకు ఒకేసారి ఒకే రోజున ఒకే టైములో ఊరేగింపులకు అవకాశం ఇవ్వవద్దని కోరారు. వీలైనంత వరకు ర్యాలీలను పక్కరోజుకి మార్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నియమాలు ప్రకారం నామినేషన్ రోజున అవసరమైన మేరకే అభ్యర్థితో పాటు వేరే వారిని లోపలికి పంపించాలని తెలిపారు. పోలింగ్ రోజున 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా 9వ రోజైన బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు కనకాంబరాలు, గులాబీలతో అర్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష పుష్పార్చన నిర్వహించారు. తొలుత ఆలయ ఈవో కేఎస్ రామారావు, స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, అర్చకులు అమ్మవారి పుష్పార్చన నిమిత్తం సేకరించిన పుష్పాలతో ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. రాజగోపురం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన ఆలయ అధికారులు, అర్చకులు ప్రధాన ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేదిక వద్ద ఆలయ అర్చకులు, వేద పండితులు అమ్మవారికి కనకాంబరాలు, గులాబీలు, చామంతి, మందార పుష్పాలు, మొరం, దవళంతో పుష్పార్చన నిర్వహించారు. పూజ అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

నేడు పూర్ణాహుతి

వసంత నవరాత్రోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. ఉదయం 10 గంటలకు మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో పూర్ణాహుతిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అమ్మవారికి అన్ని రకాల పుష్పాలతో అర్చన నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

రూ.4.50 లక్షల తెలంగాణ మద్యం సీజ్

ఇద్దరు నిందితుల అరెస్ట్



క్రోసూరు: పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్, అడిషనల్ ఎస్పీఆర్ రాఘవేంద్రరావు ఆదేశాల మేరకు నరసారావుపేట ఎస్ఈబీ ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ షేక్ ఖాజామొహిద్దీన్ నేతృత్వంలో క్రోసూరు సర్కిల్ ఎస్ఈబీ అధికారులు అచ్చంపేట మండలంలో బుధవారం దాడులు నిర్వహించారు. మాదిపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో ఒక ఇంటిపై దాడులు నిర్వహించి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 72 కేసుల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈదాడుల్లో 3456 మద్యం బాటిళ్ల(180 ఎంఎల్) పట్టుకున్నామని, వాటి విలువ సుమారు రూ.4.50లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నిందితులు షేక్ అబ్దుల్ సత్తార్, సద్దాం హుస్సేన్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. దాడుల్లో క్రోసూరు ఎస్ఈబీ ఎస్ఐ అశోక్‌కుమర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో ఈతకు దిగి విద్యార్థి మృతి

మేడికొండూరు: కాల్వలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతిచెందిన సంఘటన మేడికొండూరు మండల పరిధిలోని పేరేచర్లలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణానికి చెందిన ఇంకొల్లు నాగేశ్వరరావు కుమారుడు కార్తీక్ (21) మండల పరిధి సమీపంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం కళాశాల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. బుధవారం శ్రీరామ నవమి పర్వదినం కావడంతో స్నేహితులతో కలిసి గుడికి వెళ్లి వస్తానని చెప్పి పేరేచర్ల గ్రామ శివారులోని బ్రాంచ్ కెనాల్ వద్దకు ఈతకు వెళ్లాడు. కాల్వలో ఈతకు దిగిన కార్తీక్ నీటి ప్రభావం ఎక్కువగా ఉండి గల్లంతయ్యాడు. అతనితో వచ్చిన స్నేహితులు కార్తీక్ గల్లంతైన విషయం పోలీసులకు తెలియజేయడంతో మేడికొండూరు సీఐ జయకుమార్, సిబ్బందితో కలిసి వెతుకులాట ప్రారంభించారు. సాయంత్రం గల్లంతైన కార్తీక్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎంతో ఖచ్చితమైన ఓటింగ్

- అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం
- ప్రతి ఓటు చెల్లుబాటయ్యేలా ఏర్పాటు
- సమయం..శ్రమ...కాగితం ఆదా
- జిల్లాలో ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగం
- అంధుల కోసం ప్రత్యేక గుర్తులు



ఈవీఎం, వీవీ ప్యాట్‌లతో మాక్‌పోలింగ్ పై పీఓలకు అవగాహనలో కలెక్టర్ శివశంకర్ లోతేటి

సత్తెనపల్లి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) వినియోగం సర్వ సాధారణమైంది. బ్యాలెట్ పేపర్, ఈవీఎంలలో ఓటింగ్‌కు ఏది మంచిదని ప్రశ్నిస్తే మేధావులు, నిపుణులు ఈవీఎంలేనని చెబుతున్నారు. జిల్లాలో మే 13న జరిగే పోలింగ్ ప్రక్రియకు ఈవీఎంలను వినియోగించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో ఈవీఎంల వినియోగంపై ప్రజల్లో విస్తృత చైతన్యం తెచ్చే కార్యక్రమాలు ముమ్మరం చేశారు. పోలింగ్ రోజు ఈవీఎంలను వినియోగించే అంశంపై ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది.

42 ఏళ్లుగా ఈవీఎంల సేవలు

మొదట్లో దేశ వ్యాప్తంగా ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించేవారు. బ్యాలెట్ పేపర్ పై నచ్చిన అభ్యర్థి పేరుపై స్వస్తిక్ గుర్తుతో ఓటు వేసేవారు. అయితే ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పేపర్ మడవడంలో ఏ మాత్రం తేడా వచ్చిన స్వస్తిక్ ఇంక్ గుర్తు మరో అభ్యర్థి పేరుపై పడి ఆ ఓటు చెల్లకుండా పోయేది. ఈ సమస్యను అధిగమిస్తూ ప్రతి ఓటూ చెల్లుబాటయ్యేలా 1982లో తొలిసారిగా కేరళలోని ఫరూర్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఈవీఎంలను వినియోగించారు. 1984లో ఈవీఎంల వినియోగంపై సుప్రీం కోర్టు అభ్యంతరాలు తెలిపింది. తిరిగి 1988 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 81ఎ ను ప్రజా ప్రాతినిధ్య చట్టంలో చేర్చి సుప్రీంకోర్టు అనుమతితో 1990లో ఈవీఎంలను అందుబాటులోకి తెచ్చింది. 1998లో ప్రజామోదం లభించడంతో 1999-2004 మధ్య పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల వాడకం పూర్తిస్థాయిలో మొదలైంది. 2013 నుంచి వీవీ ప్యాట్లను అందుబాటులోకి తెచ్చారు.

ప్రొసీడింగ్ అధికారి వద్ద ఓ కంట్రోల్ పాయింట్

ఈవీఎంలో రెండు యూనిట్లు ఉంటాయి. ఒకటి కంట్రోల్ యూనిట్. రెండోది బ్యాలెట్ యూనిట్. ఈ రెండింటినీ ఐదు మీటర్ల కేబుల్ ద్వారా అనుసంధానం చేసి ఉంటారు. ప్రొసీడింగ్ అధికారి (పీఓ) వద్ద కంట్రోల్ యూనిట్ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్ ఓటరు ఓటు వేయడానికి వీలుగా నిర్దేశించిన ప్రదేశంలో ఉంటుంది. ఈవీఎంల వినియోగం వచ్చిన తర్వాత ఒక ఓటరు ఒక ఓటు వేయడానికి మాత్రమే వీలవుతుంది. ఓటు వేసిన వెంటనే కంట్రోల్ యూనిట్‌లోని బ్యాలెట్ బట్టన్ లాక్ అవుతుంది. ఒకేసారి 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. నోటాతో కలిపి గరిష్టంగా 384 మంది అభ్యర్థులున్నా ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించేలా సాంకేతికతను అభివృద్ధి చేశారు.

అంధుల కోసం ప్రత్యేకంగా

గతంలో అంధులు ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో మోసపోయేవారు. ఈవీఎంలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ మోసాలకు చెక్ పడింది. బ్యాలెట్ యూనిట్ లో అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపితో కూడిన గుర్తులు ఉంటాయి. ఓటు వేసే నీలిరంగు బటన్ పక్కనే బ్రెయిలీ లిపితో సంఖ్య ఉంటుంది. చేతి వేళ్లతో తడిమి తాము ఓటు వేయాలనుకున్న అభ్యర్థి వరుస నెంబర్‌ను వారు గుర్తించ గలుగుతారు. తద్వారా తమ ఓటును ఎవరి సాయం లేకుండానే వారు సొంతంగా వేసుకునే అవకాశం ఉంది.

వీవీ ప్యాట్‌లు అందుబాటులోకి

ఈవీఎంలపై నమ్మకాన్ని కలిగించేందుకు వీవీ ప్యాట్‌లను ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకువచ్చింది. 2017 నుంచి వీటిని వినియోగిస్తున్నారు. ఓటరు తాను ఓటు వేసిన వ్యక్తికే ఓటు పడిందా? లేదా? అనేది తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లు ఉపయోగపడతాయి. ఈవీఎంలోని బ్యాలెట్ యూనిట్ పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న నీలిరంగు బటన్ నొక్కగానే ఎరుపు రంగు లైట్ మెరుస్తోంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నెంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు ఏడు సెకండ్ల పాటు కనిపించి డ్రాప్ బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

నిర్ధారించుకున్న తరువాతే పోలింగ్

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్ నొక్కి ఇప్పటికే దాచిన ఓట్లేవి నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్ బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూస్తారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్‌పోల్ నిర్వహిస్తారు. ఆ తరువాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్ వీవీ ప్యాట్‌కు సీల్ వేస్తారు.

జిల్లాలో ఎన్నికలకు వినియోగించే మిషన్ల సమాచారం

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	బ్యాలెట్ యూనిట్లు	కంట్రోల్ యూనిట్లు	వీవీ ప్యాట్‌లు
పెదకూరపాడు	266	319	319	380
చిలకలూరిపేట	239	289	289	341
నరసరావుపేట	245	296	296	350
సత్తెనపల్లి	274	328	328	391
వినుకొండ	299	358	358	427
గురజాల	304	324	324	440
మాచర్ల	299	358	358	433
మొత్తం	1,926	2,272	2,272	2,762

ఓట్ల లెక్కింపులో సమయం ఆదా

ఈవీఎంల వినియోగం ద్వారా ఓట్ల లెక్కింపులో పూర్తిగా సమయం ఆదా అవుతోంది. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు వారి ప్రతినిధులు రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములు తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు చేపడతారు. లెక్కింపు పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ స్లిప్పులను బయటకు తీసి అభ్యర్థులు వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవర్‌లో భద్రపరుస్తారు.

వైఎస్సార్ సీపీలోకి 40 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు



పార్టీలో చేరిన నాయీ బ్రాహ్మణులతో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

సంక్షేమం, అభివృద్ధి చూసి చేరుతున్నారన్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలు, నిర్వహించిన అభివృద్ధి పనులకు ఆకర్షితులైన అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీపై ఆదరణ చూపిస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో బరంపేటకు చెందిన 40 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు అన్నంగి ముత్తాలరావు, చెన్నుపల్లి గిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారందరికీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా ఇచ్చినందుకు ఆ వర్గీయులు సీఎం జగన్‌కు మద్దతు తెలియజేస్తున్నారన్నారు. పట్టణంలో నాయీబ్రాహ్మణులు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం కావాల్సిన స్థలాన్ని ప్రభుత్వం మళ్లీ ఏర్పడగానే అందజేస్తామన్నారు. దీనిపై స్పందించిన పలువురు నాయీ బ్రాహ్మణ నాయకులు వచ్చే ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డిలు భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తూరి సురేష్, వద్దుల సుబ్బారెడ్డి, ఊర భాస్కరరావు, నిడమానూరు సురేంద్ర, అత్తలూరి శ్రీకృష్ణ, వీఎస్‌పీ సాంబ, మూరే రవీంద్రారెడ్డి, కనకా పుల్లారెడ్డి, కొమ్మసాని కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి చేరికలు



పార్టీలో చేరిన పట్టణవాసులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు



కొత్తకొత్తపాలెం వాసులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ ఎమ్మెల్యే బొల్లా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ వినుకొండ కార్యాలయంలో పట్టణంలోని 3,4 వార్డులకు చెందిన 10 కుటుంబాలు, నూజెండ్ల మండలం కొత్తకొత్తపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమపథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం పట్టణానికి చెందిన సుద్దగుంతల కాలనీ, 2వ వార్డుకు చెందిన పలువురు టీడీపీని వీడి ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ పార్టీ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానమిస్తుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ధ్యేయమనే విషయాన్ని ఇంటింట ప్రచారం చేసి పార్టీ గెలుపునకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన 15 మందికి స్వాగతం చెబుతూ పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన జగనన్నతోనే సాధ్యం

మంత్రి అంబటి సతీమణి విజయలక్ష్మి



ఎన్నికల ప్రచారంలో భాగంగా పునుగులు వేస్తున్న అంబటి విజయలక్ష్మి

సత్తెనపల్లి: నిరుపేదలకు మేలు చేస్తూ ప్రజారంజక పాలన సాగించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో బుధవారం రాత్రి ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు గడప గడపలో ఆమెకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబటి విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు రాలేదని, నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నామన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో ప్రజలందరికీ మంచి జరిగి ఉంటే ఓటేయండి అని, లేదంటే వద్దని చెప్పే దమ్మున్న నాయకుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి తద్వారా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మంత్రి తనయ అంబటి మనోజ్ఞ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, నాయకులు చిలుకా నాగేశ్వర రావు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

25న ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్జేసీ డీసీ సెట్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశానికై ఈనెల 25న జరగనున్న పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5,6,7,8వ తరగతుల్లో ప్రవేశానికై ఏపీఆర్ఎస్ క్యాట్-2024 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2024 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జరుగుతుందని వివరించారు. హాల్ టికెట్లను http://aprs. apcfsf.in వెబ్‌సైట్‌లో విద్యార్థి ఐడీ, పుట్టిన తేదీ వివరాలతో బుధవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్ నుంచి పొందిన హాల్ టికెట్లతో ఈనెల 25న జరగనున్న పరీక్షలకు సంబంధిత కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

స్కాంల బాబు వద్దు.. స్కీంల జగనన్నే ముద్దు



24వ వార్డు ఎన్నికల ప్రచారంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న డాక్టర్ సుస్మితారెడ్డి



28వ వార్డు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ల బృందం

- నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ బృందం విస్తృత ప్రచారం
- 24వ వార్డులో డాక్టర్ గోపిరెడ్డి సుస్మితారెడ్డి ప్రచారం

నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలు తమకు సంక్షేమ పథకాలు అందజేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ డాక్టర్ల బృందం బుధవారం పట్టణంలోని 28వ వార్డు పాతూరు, మల్లమ్మసెంటర్ పరిసరాల్లో షాపులు, గృహాలకు వెళ్లి ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. డాక్టర్ కారసాని మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే స్కాములు తప్ప స్కీములు ఉండవన్నారు. గత 14ఏళ్ల చరిత్రలో అతనికి చెప్పుకునేందుకు ఏమీలేదని ఎద్దేవా చేశారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ 45మంది డాక్టర్లు ప్రచారంలో పాల్గొన్నారన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. సీఎం జగన్ కోరిన విధంగా 175 సీట్లకు 175తో పాటు 25 పార్లమెంటు సీట్లు గెలుస్తామని పేర్కొన్నారు. డాక్టర్లు ఏఏవీ రామలింగారెడ్డి, ఓరుగంటి శేషిరెడ్డి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మేకల చంద్రకిరణ్, కె.జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్.రాజానందనరెడ్డి, వసంతరాయ, ప్రదీప్‌రెడ్డి, నాయకులు ఊర భాస్కరరావు, దివ్వెల రామకృష్ణ, చీతిరాల గురుపెద్దన్న, కేపీ రంగారావు, ప్రవల్లికా సత్యం, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

24వ వార్డులో డాక్టర్ సుస్మిత ప్రచారం...

అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సతీమణి డాక్టర్ సుస్మితారెడ్డి బుధవారం పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ 24వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాన్ని అందజేసి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. అభయాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏపీఐసీసీ డైరక్టర్ కాకుమాను సదాశివ రెడ్డి, నాయకులు సానికొమ్ము సుబ్బారెడ్డి, పూనూరి కోటిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్లలో గజమాలతో ప్రభుత్వ విప్ పీఆర్కేను సత్కరిస్తున్న దృశ్యం

మాచర్ల: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి మేలు చేసి వారి జీవితాల్ని మార్చాలని తపనపడిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మాచర్ల పట్టణంలోని 5,6,7 వార్డుల్లో సుద్దగుంతల, రైల్వే ట్రాక్ బజారు, 1,2వ లైన్లు, పీడబ్ల్యూడీ కాలని, సొసైటీ కాలనితో పాటు ఆయా ప్రాంతాలలో ఎన్నికల ప్రచారాన్ని సాయంత్రం 6 నుంచి రాత్రి 9.45గంటల వరకు నిర్వహించారు. ఆయా వార్డు కౌన్సిలర్లు కలివెల జ్యోతి, గెల్లి పోగు జగన్‌మోహన్, పోలగాని రమణ, శంకర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఐదు సంవత్సరాలు రూ. 2.70లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాలలో వేసి అనేక సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు చేపట్టి మీ గుండెల్లో నిలిచారన్నారు. సీఎం జగన్‌ను ఏదో విధంగా ఓడించాలని ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, దీనిని తిప్పికొట్టే బాధ్యత ప్రతి పేద కుటుంబంపై ఉందన్నారు.. అందరూ మళ్లీ సంక్షేమ పథకాలు పొందాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ప్రజలు పీఆర్కేకు గజమాల వేసి, మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వందలాది మంది ర్యాలీగా ఆయా వార్డులలో ప్రతి ఇంటికి కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్, బత్తుల ఏడుకొండలు, అబ్దుల్ జలీల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణాధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, ఆయా వార్డు కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, గట్ల కోటిరెడ్డి, షేక్ సుభాని, మస్తాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసశర్మ, పార్టీ నాయకులు మంచికల్లు నాగిరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, పిచ్చయ్య, రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంఆర్ఎఫ్ రామాంజనేయరెడ్డి, నాయకులు సాధనాల నాగేశ్వరరావు, డేవిడ్, వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు

ఎన్ఎస్‌పీ డీఈ చాట్రగడ్డ రామారావు



శావల్యాపురం: సాగర్ జలాలు చేపల చెరువులకు వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ (ఎన్ఎస్‌పీ) డీఈ చాట్రగడ్డ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ నుంచి సాగర్ జలాలు విడుదల చేయగా, పోట్లూరు మేజరు కాల్వను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గండికొట్టి నీటిని దారి మళ్లించారు. ఘటనాస్థలాన్ని సందర్శించిన డీఈ మాట్లాడుతూ సాగర్ జలాలు ప్రజల తాగునీటి అవసరాల కోసం మాత్రమే ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. ఈక్రమంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పోట్లూరు మేజరు కాల్వ నుంచి శావల్యాపురం మంచినీటి చెరువుకు వచ్చే కాల్వను పోట్లూరు గ్రామ సమీపంలో పగలకొట్టగా నీరు అంతా మరో మార్గం వైపు మళ్లించారన్నారు. దీంతో పోట్లూరు మేజరుకు వచ్చే సాగర్ జలాలను నిలుపుదల చేసి అనంతరం పొక్లెయిన్ ద్వారా కాల్వకు మరమ్మతులు చేయించామన్నారు. ఎన్నెస్పీ ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ లిఖిత పూర్వకంగా పోలీసులు ఫిర్యాదు చేసి కాల్వను పగలగొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోట్లూరు మేజరు కాల్వ ద్వారా సాగర్ జలాలు విడుదల చేశారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్, ఎన్నెస్పీ అధికారులు నందకిషోరు ఉన్నారు.

నీటికుంటలో పడి వృద్ధుడు మృతి



చీరాల: బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి వృద్ధుడు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం మండలంలోని విజయనగర్‌కాలనీ గ్రామంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు అందించిన వివరాలు.. విజయనగర్ కాలనీకి చెందిన మోటూరి జయరావు(60) బుధవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటి కుంటలో పడి మృతి చెందాడని స్థానికుల నుంచి సమాచారం అందింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి శవపరీక్ష నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.